క్లుప్తంగా

90 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

రాజుపాళెం: రాజుపాళెం మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి వాటిని అక్రమంగా ప్రొద్దుటూరుకు తరలిస్తున్న 90 బస్తాలను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన చెరుకుచెర్ల వెంకటేష్ అనే వ్యక్తి టాటా ఇంట్రా పికప్ వ్యాన్‌లో బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం రావడంతో పట్టుకున్నామన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కువైట్‌లో చెర్లోపల్లె వాసి మృతి

అట్లూరు : మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన జమ్మన సుబ్బనరసారెడ్డి (50) బుధవారం తెల్లవారుజామున కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. మృతుని బంధువుల వివరాల మేరకు.. సోమశిల ముంపు గ్రామమైన చెర్లోపల్లె గ్రామానికి చెందిన సుబ్బనరసారెడ్డి 20 సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు. అయితే బుధవారం తెల్లవారుజామున చాతిలో నొప్పి రావడంతో ఉన్నఫలంగా కిందపడ్డాడు. దీంతో అతని స్నేహితులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెకు సంబంధించి రంధ్రాలు బ్లాక్ అయ్యాయని, సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్ చేసేందుకు థియేటర్‌లోకి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నదానం మహాదానం



భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : అన్నదానం మహాదానమని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక వినాయక నగర్‌లోని వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద బుధవారం రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచమల్లుతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు వారు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, సందీప్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం విడనాడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంగమునిరెడ్డి

బ్రహ్మంగారిమఠం: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం విడనాడాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి అన్నారు. బుధవారం ఎంపిపీడీఓ సభాభవనంలో ఏపీఓ కృష్ణ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన దారులతో ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేయించాలన్నారు. పని సమయంలో కాల క్షేపం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

పోరుమామిళ్ల: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్స్ దర్బార్‌వలి, ఖాదర్‌బాషా తెలిపారు. మండలంలోని రాజాసాహేబ్‌పేట పంచాయతీ తిరువెంగళాపురంలో బుధవారం 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సూచన మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్స్, డ్వాక్రా గ్రూప్ సీసీ అబ్దుల్ రహీం సమావేశంలో మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ లైంగికంగా సంక్రమించే వ్యాధులన్నారు. లైంగిక సంపర్కం వల్లనే కాకుండా రక్త మార్పిడి ద్వారా కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశ ముందని తెలిపారు. వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్ఓ సంధ్య, విష్ణువర్ధన్, ఆశాలు, గ్రామ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

కాలువపల్లెలో పొలంబడి

గోపవరం : మండలంలోని కాలువపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం గ్యాప్ పొలంబడి నిర్వహించారు. బద్వేలు ఏడీఏ నాగరాజ, ఏఓ రామకృష్ణయ్య పంటల సాగు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఉత్తమ యాజమాన్య పద్ధతులు, ద్రవ జీవామృతం తయారు చేసి వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతి బుధవారం నిర్వహించే పొలంబడి కార్యక్రమంలో రైతులు పాల్గొని పంటల సాగు, చీడపీడల గురించి వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని కోరారు. వరినాట్లు వేసే ముందు కొనలు తుంచడం, నాటిన తర్వాత కాలిబాటలు తీయడం వలన చీడపీడలు వ్యాపించవని, దిగుబడి కూడా అధికంగా ఉంటుందన్నారు.

గంగఒడికి చేరిన గౌరీ సుతుడు



బద్వేలు అర్బన్ : గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ప్రొద్దుటూరు కల్చరల్ : బొల్లవరంలో నిమజ్జనానికి తరలిన ఏకదంతుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : విఘ్నాలు తొలగించమని గణనాథున్ని కోరుతూ ఎంతో నిష్ఠతో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు కోలాహలంగా గౌరీసుతుడిని గంగ ఒడికి చేర్చారు. బుధవారం కుల, మతాలకు అతీతంగా కేరింతలు కొడుతూ యువత ఉత్సాహంగా వేడుకలు చేసుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు. ఉదయం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజించారు. మధ్యాహ్నం కొందరు కమిటీల వారు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం బొజ్జగణపయ్య విగ్రహాలను ట్రాక్టర్లలోకి ఎక్కించి డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. పెన్నానది, చాపాడు, కామనూరు వద్ద ఉన్న కుందూనదిలో ఇక సెలవంటూ వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఘనంగా నిమజ్జనం

కాశినాయన : మండలంలోని నరసాపురం, బాలాయపల్లె గ్రామాల్లో బుధవారం గణనాథుని నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయకుడి లడ్డూ, చెరకుగడలు, వెలక్కాయలను వేలంపాట వేశారు. డప్పువాయిద్యాలతో గణనాథుని ఊరేగింపు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. యువత రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సందడిగా నిమజ్జన వేడుకలు

చాపాడు: మండల వ్యాప్తంగా ఐదో రోజు బుధవారం గణనాథుడి నిమజ్జన వేడుకలు సందడిగా జరిగాయి. మండలంలో వివిధ గ్రామాలలో కొలువుదీరిన వినాయకుడి విగ్రహాలను సీతారామాపురం, అన్నవరం గ్రామాల వద్ద గల కుందూనదిలో నిమజ్జనం చేశారు.

కన్నుల పండువగా నిమజ్జనం

ఖాజీపేట : మండల వ్యాప్తంగా లంబోదరుడి నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ట్రాక్టర్లలో వినాయకుడిని ఊరేగిస్తూ, బాణసంచా పేల్చుతూ, డప్పులు వాయిస్తూ, నిమజ్జనానికి తరలించారు. అనంతరం పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

లడ్డూ రూ. 92 వేలు

దుంపలగట్టు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను కమిటీ సభ్యులు వేలం నిర్వహించారు. వేలంలో కిషోర్‌కుమార్‌రెడ్డి రూ. 92 వేలు పాడి స్వామి వారి ప్రసాదం దక్కించుకున్నారు.

వైభవంగా నిమజ్జనం

పోరుమామిళ్ల: ఐదు రోజులుగా వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి బుధవారం వైభవంగా నిమజ్జనానికి తరలించారు. మహిళల కోలాటాలు, యువత చిందులేస్తూ.. రంగులు చల్లుకుంటూ కోలాహలంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ శివారులోని మల్లకతవ మడుగులో క్రేన్ సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గణపయ్యా... ఇక సెలవయ్యా.!

రాజుపాళెం : గణపయ్య ఇక సెలవయ్యా అంటూ మండలంలోని పలు గ్రామాల్లోని బుధవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. స్వాములకు ప్రత్యేక పూజల తర్వాత డప్పు వాయిద్యాలతో గణనాథున్ని వీధులలో తీసుకెళ్లారు. ఇంద్రనగర్ వాసులు రంగురంగుల వేషధారణతో పాటు గుర్రం బొమ్మతో చేసిన నృత్యం అందరిని అలరించింది. యువకులు, పెద్దలు, మహిళలు రంగులు చల్లుకుంటూ నత్యాలు చేసుకుంటూ ఎంతో కుందూనదిలో ఆనందంగా నిమజ్జనం చేశారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని మైదుకూరురోడ్డులో ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వారికి నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేసి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు చెవులవెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, చెన్నకృష్ణారెడ్డి, రమణారెడ్డి, వీరనారాయణరెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, ఉత్సవ కమిటీ సభ్యులు విజయకుమార్, చంద్రశేఖర్, జయకుమార్, శేఖర్, సురేష్ పాల్గొన్నారు.

గంగ ఒడిలోకి గణనాథులు

వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలు 5వరోజు నిమజ్జనంలో భాగంగా బుధవారం వైభవంగా గంగ ఒడికి చేరుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించుకోండి

అట్లూరు : వినాయక నిమజ్జనాన్ని ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణయ్య సూచించారు. బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విగ్రహాల కమిటీ సభ్యులతో ఎస్ఐ మాట్లాడారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.



రాజుపాళెం: గణపయ్యలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



కాశినాయన : నరసాపురంలో నిమజ్జనానికి వెళుతున్న గణనాథులు



విచిత్ర వేషధారణలో విద్యార్థులు



చాపాడు: వినాయకుడి నిమజ్జన వేడుకలో సందడి చేస్తున్న యువత



ఖాజీపేట : స్వామి వారి లడ్డూను తీసుకెళ్తున్న భక్తులు



పోరుమామిళ్ల: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



అట్లూరు : వినాయక విగ్రహ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణయ్య

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ సూచించారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాళ్లమాపురం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ స్థాయిలో అందుతున్న వైద్యసేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వర్షా కాలంలో జ్వరాలు ఎక్కువగా వస్తాయని, జ్వరం వచ్చిన వెంటనే రక్తపరీక్ష చేయించుకొని డాక్టర్ సూచన మేరకు మందులు వాడాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి వారం డ్రైడేను పాటిస్తే దోమలు వ్యాప్తి తగ్గుతుందని చెప్పారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ విజయకుమారి, సీహెచ్ఓ వెంకటేష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము 10–15 ఏళ్ల నుంచి వైద్య విధాన పరిషత్, ఎస్ఎన్‌సీయూ, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా కొనసాగుతున్నామని చెప్పారు. 2011 తర్వాత ఏపీ ప్రభుత్వం రెగ్యులర్ స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. అప్పటి నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలోనే భర్తీ చేసుకుంటూ వస్తున్నారని తెలిపారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎలాంటి అదనపు జీతం తీసుకోకుండా పని చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 4న ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 115లో ఏఎన్ఎం టూ జీఎన్ఎం ఇంటర్‌ఫైడ్ ప్రోగ్రాం రెండేళ్లు చేసిన వారిని ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సుల స్థానంలో రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తున్నట్లు జీఓలో పేర్కొన్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో పని చేసిన తమని రెగ్యులర్ చేయకుండా రెండేళ్ల ఇంటర్‌ఫైడ్ ప్రోగ్రాంలో పని చేసిన వారిని రెగ్యులర్ స్టాఫ్ నర్సుల పోస్టుల్లో నియమించడం ఆమోదయోగ్యం కాదన్నారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులందరినీ రెగ్యులర్ చేసేంత వరకు జీఓ నెంబర్ 115ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, మేల్ స్టాఫ్‌నర్స్ లోకేష్, హెడ్ నర్సులు లిల్లీఫ్లోరెన్స్, సుబ్బమ్మ, హేమావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- ప్రచారానికే చంద్రబాబు ప్రాధాన్యత
- విమర్శల నుంచి తప్పించుకునేందుకే... బోట్ల డ్రామా
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : విజయవాడ నగరంలో వరద బీభత్సం అందరి హృదయాలను కలిచివేసిందని, తోటి వారైన తెలుగు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విపత్తుకు కారణంగా ప్రకృతా.. లేక పాలకులా అనే విషయాన్ని ఆత్మవంచన చేసుకోకుండా ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవుపలికారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వలన భారీ నష్టం జరిగిందని పేర్కొన్నారు. 29 సెంటిమీటర్ల వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ ద్వారా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. విజయవాడలోని కరకట్టపై నివాసం ఉన్న చంద్రబాబు నివాసం, ఏబీఎన్ రాధాకృష్ణ ఆస్తులు మునిగిపోకుండా ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారం 47 మంది ప్రాణాలు కోల్పోయారని, అనధికారికంగా ఎంత మంది చనిపోయారో బయటికి తెలియడం లేదన్నారు. ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ఉంటే ఈ నష్టం జరిగేది కాదన్నారు.

కరోనాలో 5 కోట్ల మందిని వైఎస్ జగన్ ఆదుకున్నారు

వరదల్లో నష్టపోయిన ఐదు లక్షల మందిని చంద్రబాబు ఆదుకోలేకపోతున్నారని రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020లో కరోనా సంభవించినప్పుడు 5 కోట్ల మందిని ఆదుకున్నారని గుర్తుచేశారు. కరోనా నివారణ చర్యల్లో మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. కరోనాతో ప్రజలు సహజీవనం చేయాల్సి ఉంటుందని జగన్ చెప్పినప్పుడు అందరూ విమర్శించారన్నారు. ముఖ్యమంత్రిగా అపార అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారని ప్రశ్నించారు. జగన్ ఆదేశిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోని ఇన్‌చార్జిలు వరద సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

బోట్ల డ్రామా

సీఎం చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బోట్ల డ్రామా ఆడుతున్నారని రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. ఇతరులపై నిందలు వేయడం చంద్రబాబుకు ఆది నుంచి అలవాటేనని తప్పుబట్టారు. 10 టన్నుల ఉండే బోట్లతో డ్యాంను పగులగొట్టడం సాధ్యమా అని ప్రశ్నించారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, గుర్రం లావణ్య, పాతకోట మునివంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చాపాడు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న ఆహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. మండలంలోని నక్కలదిన్నె అంగన్‌వాడీ కేంద్రాలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే ఆహారంలో పోషక విలువలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు అనసూయ, ప్రమీల, ఓబుళమ్మ, నిర్మల, రేణుక, సంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మైదుకూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని విశ్వనాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రక్తహీనతను అధిగమించాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వనిపెంట సెక్టార్ సూపర్‌వైజర్ ఓబుళమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి

మైదుకూరు : పంటల సాగులో సేంద్రియ ఎరువులను వినియోగించాలని మండలంలోని వనిపెంట కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన పంటలపై రైతులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో రెండో రోజు బుధవారం ఉల్లి పంటపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఉల్లి సాగులో సమగ్ర ఎరువులు, యాజమాన్య పద్ధతులు, సేంద్రీయ ఎరువుల ఆవశ్యకత, మట్టి, నీటి నమూనాల పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రి మాయమవుతున్న విద్యుత్ వైర్లు



మేకవారిపల్లె రోడ్డు వెంట విద్యుత్ వైర్లు చోరీకి గురి కావడంతో ఖాళీగా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభాలు

బి.కోడూరు: గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించి గ్రామాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో రూరల్ డెవలప్‌మెంట్ స్కీం (ఆర్‌డీఎస్ఎస్) సంబంధించి అప్పట్లో టెండర్లు పిలిచారు. అవి దక్కించుకున్న కాంట్రాక్టర్లు మండలంలో దాదాపు 90 శాతం విద్యుత్ స్తంభాలు, లైన్లను పూర్తి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను అందించాల్సి ఉంది. ఇంతలో ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొంత మంది ప్రజాప్రతినిధుల ఒత్తిడితో పనులను కాంట్రాక్టర్లు నిలుపుదల చేశారు. ఈ క్రమంలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే విద్యుత్ వైర్లను దొంగిలించి తీసుకెళుతున్నారు. ఏకంగా మేకవారిపల్లెకు వెళ్లే రహదారి వెంట ఉన్న 15 స్తంభాలకు సంబంధించిన విద్యుత్ వైర్లను ఒకేరోజు రాత్రి దొంగిలించినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. అలాగే మున్నెల్లి, ఐత్రంపేట ప్రాంతాల్లో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలకు సంబంధించిన విద్యుత్ వైర్లు రాత్రికి రాత్రే మాయమవుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద లాగిన విద్యుత్ వైర్లన్నీ బిల్లులు అందక ముందే దొంగతనానికి గురైతే పరిస్థితి ఏమిటని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

డీపీటీఓ నిరంకుశ వైఖరి తగదు

మైదుకూరు : ప్రజా రవాణా సంస్థ కడప డీపీటీఓ నిరంకుశ వైఖరి తగదని మైదుకూరు డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు హితవుపలికారు. డీపీటీఓ నిరంకుశ వైఖరికి నిరసనగా బుధవారం డిపో ఆవరణలో ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తాము పీటీడీ పాలసీకి కానీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గానీ ఆందోళన చేయడం లేదని తెలిపారు. కేవలం డీపీటీఓ నిరంకుశ వైఖరికి, జిల్లాలోని అధికారుల సూపర్‌వైజర్లపై నియంత్రణ కోల్పోయి కార్యాలయ ఆదేశాలు పాటించకపోవడంపై ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ నియమ నిబంధనలు పాటించకపోవడంపై, అక్రమ బదలీలు, సస్పెన్షన్లు చేయడం మానుకోవాలని కోరారు. పలు డిపోల్లో కొందరు డిపో మేనేజర్లు సూపర్‌వైజర్ల తప్పులకు మద్దతు పలుకుతున్నారని ఈ పద్ధతి విడనాడాలని డిమాండ్ చేశారు. 8 నెలలుగా డీపీటీఓ కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలపై అనేక విజ్ఞప్తులు చేసినప్పటికీ పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని డిపోల్లో ఎన్ఓ అలవెన్స్‌లను చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కడప, మైదుకూరు, బద్వేలు నూతన కండక్టర్లు, డ్రైవర్లకు ఫిక్స్ చార్జులను వేయాలని డిమాండ్ చేశారు. అక్రమ రికవరీలు చేసి ఉద్యోగులను వేధిస్తున్న జమ్మలమడుగు డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. డిపోకు చెందిన కండక్టర్లు నాగరాజు, రెడ్డయ్య రిలే దీక్షలో కూర్చున్నారు. వీరికి మద్దతుగా ఎన్ఎంయూఏ డిపో అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి బీఎస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, కేసీ కొండయ్య, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్‌రావు, చంద్రయ్యలు పేర్కొన్నారు. రీజనల్ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం బద్వేలు డిపోలో ఒకరోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. యూనియన్ జాయింట్ సెక్రటరీ కె.వి.రమణ, నాయకులు రమణ, బాల, కె.ఎస్.రాయుడు, మల్లి, ఎం.ఎస్.రాయుడు, ఆర్.వి.రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.


కస్తూర్బాకు ఆలస్యంగా వస్తే రూ.100 కట్టాల్సిందే

చాపాడు: స్కూల్ సెలవులు ముగియగానే పాఠశాలకు రావాల్సిందే.. ఏ ఒక్క రోజు ఆలస్యమైనా ఒక్కో విద్యార్థి రూ.100లు ఫైన్ కట్టాల్సిందే.. లేకుంటే పాఠశాల బయట ఉండాల్సిందే.. ఇది మండల కేంద్రమైన చాపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గత కొంత కాలంగా జరుగుతున్న తంతు. ఈ నెల 7వ తేదీ శనివారం వినాయక చవితి సందర్భంగా సెలవు ఇచ్చారు. మరుసటి రోజు ఆదివారం కావడంతో రెండు రోజులు ఇంటికెళ్లి సోమవారం పాఠశాలకు రావాలని కస్తూర్బా స్పెషలాఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులను లోపలికి రానిచ్చారు. మంగళ, బుధవారాల్లో వచ్చిన విద్యార్థులు మాత్రం స్కూల్ లోపలికి రావాలంటే రూ.100 ఫైన్ కట్టాలని షరతు విధించారు. చేసేదేమీ లేక మంగళ, బుధవారాల్లో పాఠశాలకు వచ్చిన విద్యార్థులందరూ రూ.100 ఫైన్ కట్టారు. పేదలం కాబట్టే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నామని స్కూల్‌కు ఆలస్యమైతే రూ.100 ఎలా కట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పెషలాఫీసర్ ఏమన్నారంటే..

కస్తూర్బాలో పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల నుంచి రూ.100 వసూలు చేస్తున్న సంఘటనపై కేజీబీవీ స్పెషలాఫీసర్ నాగలక్షుమ్మతో మాట్లాడగా.. విద్యార్థులు సెలవులు ముగియగానే స్కూల్‌కు రావడం లేదని రెండు మూడు రోజులు ఆలస్యంగా వస్తున్నారని చెప్పారు. విద్యార్థులు సమయానికి రావాలని విద్యార్థుల కమిటీ సూచన మేరకు రూ.100 రాబట్టామన్నారు. డబ్బును విద్యార్థుల పేరుతో భద్రపరిచి వారి అవసరాలకు వినియోగిస్తామని చెప్పారు.

నీలాపురం ఎంపీటీసీ మృతి



సుబ్బరాయుడు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : దువ్వూరు మండలం నీలాపురం ఎంపీటీసీ నాయినేని సుబ్బరాయుడు (70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి దాసరిపల్లెలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఎంపీటీసీ సుబ్బరాయుడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఎంపీటీసీ కుమారుడు రమేష్‌ను, కుటుంబ సభ్యులను రఘురామిరెడ్డి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, నాయకులు బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, వీపీ స్వామి, నీలాపురం సర్పంచ్ పల్లె రామయ్య, పెంచికలపాటి రమణయ్యనాయుడు, ముదుమాల శివశంకర్, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం చేసుకోవద్దు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

మైదుకూరు : మాదకద్రవ్యాలు అలవాటు చేసుకుని యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 15 రోజుల పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదక ద్రవ్యాలు– నిర్మూలన పక్షోత్సవాల పోస్టర్లను బుధవారం డీఎస్పీ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎక్కువగా యువత సరదాల కోసం మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మైదుకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా మత్తు పదార్థాలు అమ్మిన, సేవించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా.. తీసుకున్నా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ సయ్యద్ హసం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వాగ్దాడం శివశంకర్, ఇమ్మడిశెట్టి సతీష్‌బాబు, హుస్సేన్ సాబ్ పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు

ఖాజీపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఖాజీపేట సీఐ మోహన్ విద్యార్థులకు సూచించారు. బుధవారం మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలు–నిర్మూలన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. చెడు వ్యసనాలు ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితుల్ని పాడు చేస్తాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అలవాటు పడి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ చెడు వ్యసనాలను విద్యార్థులు దూరంగా ఉండాలని, అప్పుడే తమ ఉన్నతికి బాటలు వేసుకుంటారని అన్నారు. ప్రిన్సిపాల్ విజయ నరసింహ, విజయకుమార్, నరసింహ, శివశంకర్, నాగరాజు పాల్గొన్నారు.